
సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం, 27, మే, 2023



వెలుగు చూసిన శిల్పాలు, శాసనాలు

జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రమైన వేంపల్లె గండిలో రెండు శాసనాలు, రెండు శిల్పాలను గుర్తించారు. -10లో..



వరుస చోరీలు.. ప్రజలు బెంబేలు

ప్రొద్దుటూరులో వరుస చోరీలు జరుగుతుండటంతో ఇల్లు వదలి బయటికి వెళ్లాలంటే ప్రజలు భయపడి పోతున్నారు. -10లో..



కోలుకుంటున్న బస్సు ప్రమాద బాధితులు

మదనపల్లె మండలంలోని కూకటిమానుగడ్డ వద్ద ప్రైవేట్ బస్సు బోల్తా ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు కోలుకుంటున్నారు. -10లో..

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీకి 793 మంది గైర్హాజర్

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి కడపజిల్లావ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన ఇంటర్ సప్లిమెంటరీ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 793 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉమ్మడిజిల్లాలో 62 పరీక్షా కేంద్రాలలో 793 మంది గైర్హాజరై 94.81 శాతం హాజరు నమోదైయింది. ఆర్ఐవో రమణరాజు కడప, ఖాజీపేట, మైదుకూరులోని పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మైదుకూరులో కాపీయింగ్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను ఆయన డిబార్ చేశారు. అలాగే జిల్లా కమిటీ సభ్యులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు కూడా పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాలో పాఠశాల విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది అయిన సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, రికార్డు అసిస్టెంట్లు, అటెండర్లు మరియు స్వీపర్లు బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి దరఖాస్తులను ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కడప డీఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు. రెండు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్నవారంతా బదిలీలకు అర్హులని, 5 సంవత్సరాలు ఒకే స్థానంలో సర్వీసు పూర్తి చేసిన వాళ్లు తప్పని సరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు.

తెలంగాణ ఎంసెట్‌లో రాణించిన విద్యార్థి




కర్రు భార్గవ నందన్

జమ్మలమడుగు: తెలంగాణ ఎంసెట్ ఓపెన్ కేటగిరిలో వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండల పరిధిలోని పి.బొమ్మెపల్లి గ్రామానికి చెందిన కర్రు భార్గవనందన్ 23వ ర్యాంకును సాధించాడు ఇంజినీరింగ్ విభాగంలో 160 మార్కులకు గాను 150 మార్కులు సాధించినట్లు తండ్రి సంజీవరెడ్డి తెలిపారు. ఇటీవల జేఈఈ మెయిన్స్‌లో కూడా 99.6 శాతం మార్కులతో మంచి ర్యాంకు సాధించినట్లు చెప్పారు.

త్వరలో పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు

కడప అర్బన్: సుప్రీంకోర్టు సూచనల మేరకు దేశవ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్రంలో ప్రధానంగా వైఎస్ఆర్ జిల్లా కడపలోని నాలుగు పోలీస్‌స్టేషన్‌లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. కడప వన్‌టౌన్, టూటౌన్, తాలూకా, చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌లలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన కేబుల్ వర్క్‌ను పూర్తి చేశారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో సీఐ గది నుంచి లాకప్ గది వరకు, ఎస్ఐలు, రైటర్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలలో వీటిని అమరుస్తారు. కడప వన్‌టౌన్‌లో 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే కడపలోని 'దిశ' పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, డీఎస్పీ ఛాంబర్ నుంచి మానిటరింగ్ చేస్తున్నారు.

ప్రొద్దుటూరు కోర్టు పరిశీలన



న్యాయవాదులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీనివాసమూర్తి

ప్రొద్దుటూరు క్రైం: ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీనివాసమూర్తి శుక్రవారం ప్రొద్దుటూరు కోర్టును సందర్శించారు. అసంపూర్ణంగా ఉన్న మొదటి అంతస్తును జడ్జి ఈ సందర్భంగా పరిశీలించారు. ఇక్కడి భవనాలు పూర్తయితే సౌకర్య వంతంగా ఉంటుందని న్యాయవాదులు జడ్జితో అన్నారు. అనంతరం జిల్లా జడ్జి బార్ అసోసియేషన్ కార్యాలయానికి చేరుకొని న్యాయవాదులతో మాట్లాడారు. పెండింగ్ కేసులు, సిబ్బంది కొరత, వసతుల గురించి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అబిద్‌హుస్సేన్ ప్రస్తావించగా త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జడ్జి చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్ఎం ప్రసాద్, మహిళా కార్యదర్శి రేష్మా, సీనియర్ న్యాయవాదులు ముడిమేల కొండారెడ్డి, హరి, రియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ సదస్సు

రైల్వేకోడూరు అర్బన్: మండలంలోని అనంతరాజుపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో సంప్రదాయ కూరగాయల ఆవశ్యకతపై జాతీయ స్థాయి సదస్సు నేటి నుంచి రెండురోజుల పాటు ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ గోపాల్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ కూరగాయల సాగు, శాస్త్రీయ పరిశోధన ప్రగతి వివరించే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేలమ్మకు నవహారం

- ప్రధాన పంటలకు ముందు పచ్చిరొట్టగా నవధాన్యాలసాగు
- భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాలు పెరుగుదల
- తగ్గనున్న ఎరువుల వాడకం
- జిల్లాలో 264 గ్రామ పంచాయతీల్లో శ్రీకారం



సాగులో ఉన్న నవధాన్యాల పంటలు (ఫైల్)

కడప అగ్రికల్చర్: నీటి వసతులు ఉన్న ప్రాంతాల్లో రైతులు ఏటా రెండు, మూడు పంటలు సాగు చేసి లాభాలు గడిస్తున్నారు. కానీ భూమి ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదు.రసాయనిక ఎరువులు, క్రిమ సంహారక మందుల వాడకంతో భూసారం తగ్గిపోతోంది. ఫలితంగా పంట దిగుబడులు తగ్గడంతోపాటు భూమి సాగుకు పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నేలతల్లి మెడలో పోషకాల హారం వేసేందుకు శ్రీకారం చుట్టింది. ఖరీఫ్‌కు ముందు నవధాన్యాల సాగుపై రైతుల్లో అవగాహన కల్పించి పుడమికి ఆరోగ్య రక్ష కడుతోంది. ఇందుకు సంబంధించి సాగుకు వీలుగా నవధాన్యాలను పంపిణీ చేసింది. జిల్లాలో 36 మండలాల్లో ఏటా ఖరీఫ్‌లో 1,50 వేల ఎకరాల్లో వరి, పసుపు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, శనగ, పత్తి, ఉల్లి తదితర పంటలు సాగు చేస్తారు. ప్రధాన పంటలసాగుకు ముందు నవధాన్యాలు సాగు చేస్తే భూమికి అవసరమ్యే పోషకాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో వ్యవసాయశాఖ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విభాగం పరిధిలో జిల్లాలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

జిల్లాలో సాగు లక్ష్యంగా...


జిల్లాలో పలు ప్రాంతాల్లో నవధాన్యాల సాగును రైతులు ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 206 ఆర్‌బీకేల పరిధిలోని 264 గ్రామ పంచాయతీల్లో 58016 మంది రైతులకు సంబంధించి 29,288 నవధాన్య కిట్లను పంపిణీ చేశారు. వీటి ద్వారా 71,281 ఎకరాల్లో (ప్రీ మాన్‌సూన్ డ్రై సూయింగ్) నవధాన్య పంటల సాగు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 24,549 మంది రైతులు 27,888 ఎరకాల్లో సాగు చేశారు. ఖరీఫ్ ప్రారంభం నాటికి మిగతా లక్ష్యాన్ని కూడా పూర్తి చేయనున్నారు.

రైతులకు అవగాహన:

ప్రధాన పంటలకు ముందు నవధాన్య పంటల సాగుపై జిల్లాలోని ఆయా మండలాల్లో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. ఇప్పటికే వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బందికి ఆర్‌బీకే, క్షేత్రస్థాయిలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. శిక్షణ పొందిన సిబ్బంది రైతులు ఆసక్తి కనపరిచేలా అవగాహన కల్పించారు.

ప్రయోజనాలు ఇవీ..

- భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాలు అభ్యమవుతాయి
- సేంద్రియ కర్బనశాతం పెరుగుతుంది
- ఏడాది పొడువునా భూమిలో పైరు ఉంటుంది. నేల చీలిపోకుండా ఉంటుంది
- నవధాన్యాల సాగుతో వేర్ల మధ్య సంపర్కం పెరిగి మొక్కకు కావాల్సిన పోషకాలు తయారవుతాయి.
- నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంటుంది.
- ప్రధాన పంటసాగులో చీడపీడలు ఆశించవు
- నవధాన్య పంటలను పొలంలో కలియదున్నడం వల్ల బాగా చితికి సేంద్రియ పదార్థంగా మారుతుంది.
- నేల భౌతిక లక్షణాల్లో మార్పు జరిగి వేరు వ్యవస్థ దృఢంగా ఉంటుంది. గాలి, నీరు సులభంగా గ్రహించడానికి వీలవుతుంది.



ప్రధాన పంటలసాగు ముందు..

నవధాన్యాల పంటల సాగుతో భూమికి కావాల్సిన పోషకాలు అధికంగా అభ్యమవుతాయి. మెక్కజొన్నలు కిలో, జొన్నలు, గోధుములు అరకిలో, పప్పు ధాన్య పంటలైన కందులు 900 గ్రాములు, పెసలు, ఉలవలు. 600 గ్రాములు, అలసంద, బొబ్బర్లు కిలో, శనగలు, అనప అరకిలో, మినుములు 6 వందలగ్రాములు, చిరుధాన్యాలకు సంబంధించి కొర్రలు 250 గ్రాములు, రాగులు 250 గ్రాములు, అరికెలు,వరిగలు, సామలు, ఊదలు 250 గ్రాములు, సజ్జలు కిలో, నూనె జాతి రకాలైన నవ్వులు, వేరుశనగలు 5 వందల గ్రాములు, ఆవాలు 5 వందల గ్రాములు, పొద్దుతిరుగుడు .150 గ్రాములు, అముదం, కుసుమలు 3 వందల గ్రాములు, పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించి జీలుగలు, కట్టిజనుము 150 గ్రాములు, పిల్లపిసలు, అవిసలు 150 గ్రాములు, పుష్పజాతికి సంబంధించి బంతి 0.03 గ్రాములు, కూరగాయలు బెండి, గోరుచిక్కుడు అరకిలో, వంకాయ, టమాటా 0.01 గ్రాములు, ఆకుకూరలకు సంబంధించి తోటకూర, పాలకూర, చుక్కాకు, గోంగూర 250 గ్రాములు, తీగ జాతి రకాలకు సంబంధించి ఆనాస, సొర, బీర, కాకర, బీన్స్, దోసకాయలు 0.01 గ్రాములు, పుచ్చ, కర్బూర, చిక్కుడు, పొట్ల కాయలను సాగు చేయాలి. సుంగంధ ద్రవాలకు సంబంధించి ధనియాలు, మెంతులు 5 గ్రాములు, గడ్డజాతికి సంబంధించి ముల్లంగి క్యారెట్, బీట్‌రూట్‌లను 500 గ్రాములతో సాగు చేసుకోవాలి.35 రకాల విత్తనాలు కలిసి ఒక్కో కిట్టు 12 కిలోల చొప్పున సిద్ధం చేసి రైతులకు అందించారు. వీటిని రైతులు సాగు చేసి పొలంలో కలియదున్నే విధానంలో జీలుగ, జనుము, అలసంద, మినుము వంటి వాటిని నీటి వసతి ఉంటే దున్నేస్తే కుల్లిపోయి భూమిలో కలిసిపోతాయి.దీనివల్ల పోషకాలు పెరుగుతాయి.



పంపిణీకి సిద్ధం చేసిన నవధాన్యాలు

లక్ష్యసాధనకు కృషి



జిల్లాలో ఈ ఏడాది లక్ష్యం మేరకు నవధాన్యాల సాగు చేయిస్తాం. ఇప్పటి వరకు 24,459 మంది రైతలు 27,888 ఎకరాల్లో నవధాన్యాల పంట సాగు చేశారు. మిగతా సాగు లక్ష్యాన్ని కూడా పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

– రామకృష్ణమరాజు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు అధికారి

రహదారుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ విజయరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : రహదారుల భద్రత కోసం పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రహదారుల భద్రత సమన్వయ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. జనాభాతోపాటు వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాదాలను అరికట్టే దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. వచ్చే నెలలో పాఠశాలలు, కళాశాలలు పునః ప్రారంభం కానున్నాయన్నారు. విద్యా సంస్థల వాహనాల కండీషన్ తనిఖీ చేసి ఫిట్‌నెస్ బాగుంటేనే తిరిగేందుకు అనుమతి ఇవ్వాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో బారికేడ్లు, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలను ఏర్పాటు చేయాలని పోలీసు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవించిన సమయాల్లో 108 వాహన సేవలు సకాలంలో అందేలా చూడాలన్నారు. తలకు గాయాలు, తీవ్రంగా గాయపడ్డ వారికి అన్ని సమయాల్లో అత్యవసర చికిత్సలు అందించేందుకు కడపలోని శ్రీ హోలిస్టిక్, సన్‌రైజ్, హిమాలయ ఆస్పత్రుల్లో ఏర్పాట్లు చేయాలన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, ఏఎస్పీ తుషార్ డూడి, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్టీఓ ఇన్‌చార్జి సుశీల, డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో ఆరోగ్యకర భోజనం

విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పిల్లలకు శుచి శుభ్రతతో కూడిన ఆరోగ్యకర భోజనాన్ని అందించాలని కలెక్టర్ విజయరామరాజు సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆన మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న 317 మంది వంట మనుషులకు నాలుగు దశల్లో శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. డీఆర్‌డీఏ మహిళా సమాఖ్య భవనంలో వచ్చేనెల 1వ తేది నుంచి కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. ఓఎస్‌డీ రఘునాథ్, సాంఘిక సంక్షేమశాఖ జేడీ జయప్రకాశ్ పాల్గొన్నారు.

ప్రాధాన్యత భవనాలు సెప్టెంబరుకు పూర్తి

ప్రాధాన్యత భవనాలైన సచివాలయాలు, ఆర్బీకేలు, డిజిటల్ లైబ్రరీలు, హెల్త్ క్లినిక్‌లు సెప్టెంబరుకు పూర్తి కావాలని కలెక్టర్ విజయరామరాజు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వారానికి 60 భవనాల స్టేజ్ కన్వర్షన్ జరగాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- పేదలందరికీ ఇళ్ల పథకం అమలులో ప్రతి అంశంలోనూ పురోగతి సాధించాలని కలెక్టర్ క్షేత్ర స్థాయి ఇంజినీర్లను ఆదేశించారు.కాలనీల్లో విద్యుత్, నీటి సరఫరా ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

బదిలీల కోలాహలం

- ఉపాధ్యాయుల దరఖాస్తులు పరిశీలించిన ఎంఈఓ, డిప్యూటీ ఈఓలు
- 28 నుంచి 29 వరకు ప్రొవిజినల్ సీనియార్టీ జాబితా ప్రదర్శన



డీఈఓ కార్యాలయంలో వివరాలను నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: విద్యాశాఖలో బదిలీల కోలాహలం మొదలైంది. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం మార్గ దర్శకాలను విడుదల చేసింది. దీంతో డీఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులతో సందడి నెలకొంది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా 1479 మంది కంపల్సరీ బదిలీలకు, మరో 3416 మంది రిక్వెస్టు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు దరఖాస్తుల పరిశీలన రాత్రి పొద్దుపోయే వరకు జరిగింది. ఆన్‌లైన్‌లో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలకు సంబంధించిన దరఖాస్తులను ఆయా మండలాల్లో ఎంఈఓలు పరిశీలిస్తున్నారు. వీటిని ఆయా డివిజన్లలో డిప్యూటీ డీఈఓ పరిశీలించి ఒకే చేస్తున్నారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ శనివారం కూడా కొనసాగనుంది.

ఖాళీల సేకరణకు కసరత్తు...

బదిలీల ప్రక్రియ ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో నిర్వహిస్తున్నందున కేడర్ల వారిగా ఖాళీలను సేకరిస్తున్నారు. ప్రస్తుతం సెకండ్ గ్రేడ్ టీచర్స్‌కు , స్కూల్ అసిసెంట్లకు పదోన్నతులు పక్రియ జరగనుండటంతో మరిన్ని ఖాళీలు ఏర్పడనున్నాయి. దీంతో డిప్యూటీ డీఈఓల ఆధ్వర్యంలో పాఠశాలల ప్రధానోధ్యాయుల నుంచి జాబితాలను తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ మరో రెండు రోజుల్లో పూర్తి కానుంది.

వెబ్ ఆప్షన్లకు అవకాశం...

ప్రధానోపాధ్యాయులు, ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు ఆన్‌లైన్ ద్వారా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునేందుకు ప్రభుత్వం అవకావం కల్పించింది. ఇందులో ప్రధానోపాధ్యాయులకు జూన్ 5 నుంచి 6వ తేదీ వరకు.స్కూల్ అసిస్టెంట్లకు 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు జూన్ 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చు.

ఆధారాలు చూపించాలి..


బదిలీ అయ్యేవారు ప్రిఫరెన్సియల్ కేటగిరిలో ఉన్నట్లయితే వారు ఆధారాల పరిశీలనకు ముందు ధ్రువీకరణ పత్రాలను అందించాల్సి ఉంటుంది. అలాగే స్పౌజ్‌కు సంబంధించి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరణ చేయాల్సి ఉంటుంది.

బదిలీల షెడ్యూల్ ఇదీ...



- ఈ నెల 24 నుంచి 26 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.
- ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను 27 వరకు పరిశీలిస్తారు.
- జాబితాలో పొరపాట్లు, తప్పులుంటే ఉపాధ్యాయులు అభ్యంతరాలు చేసుకునేందుకు 30వ తేదీ వరకు అవకాశం కల్పించారు.
- ఈ నెల 31, జూన్ 1 తేదీల్లో అభ్యంతరాలు పరిష్కరిస్తారు.
- జూన్ 2, 3 తేదీల్లో టీచర్లకు పాయింట్లను బట్టి వెబ్‌సైట్‌లో తుది సీనియారిటీ జాబితాను ఉంచుతారు.
- జూన్ 4న ఖాళీల ప్రదర్శన ఉంటుంది.

పారదర్శకంగా బదిలీలు



ఉపాధ్యాయుల బదిలీల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. ఎస్‌జీటీలు, ఎస్ఏలు, హెచ్‌ఎంలు కంపల్‌సరీతోపాటు రిక్వెస్ట్ బదిలీలకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వాటిని పరిశీలించి ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం బదిలీల ప్రక్రియ నిర్వహిస్తాం.

– రాఘవరెడ్డి, డీఈఓ, వైఎస్సార్‌జిల్లా

అందరికీ గృహయోగం

కోడూరులో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఇది మూడో వెంచర్
- మధ్యతరగతి ఆదాయ వర్గాలకు మంచి అవకాశం



కడప కార్పొరేషన్: సొంతిల్లు అనేది ప్రతి ఒక్కరి కల. ఆ కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంఐజీ లే ఔట్లు ఏర్పాటు చేసి, మౌలిక వసతులు కల్పించి, తక్కువ ధరలకే ప్లాట్లు విక్రయిస్తోంది. ప్రస్తుత అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో దిగువ అబ్బరంలో మొదటి లే ఔట్ ఏర్పాటు చేశారు. తర్వాత బద్వేల్‌లోని గోపవరంలో...ప్రస్తుతం కోడూరు వెస్ట్ విలేజ్‌లో ఏర్పాటు చేస్తున్నారు. కోడూరు బస్టాండుకు 5 కిలో మీటరుల, రైల్వేస్టేషన్‌కు 4 కిలోమీటర్ల దూరంలో ఈ లే ఔట్ ఉండటం కలిసొచ్చే అంశం. అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అనుడ) ఆధ్వర్యంలో ఇక్కడ నీటి వసతి, రహదారులు, పార్కులు, విద్యుత్ వంటి సౌకర్యాలు సమకూర్చనున్నారు.

- అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు మండలం, కోడూరు వెస్ట్ విలేజ్‌లో సర్వే నంబర్ 2224/1, 2224/3,2202/1,2202/2, 2202/3,2202/4, 2202/5 లలో 20.00 ఎకరాల విస్తీర్ణంలో 'జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్(ఎంఐజీ లే ఔట్)'ఏర్పాటు చేస్తున్నారు. ఒక చదరపు గజం రూ.5500 విలువతో ఈ ప్లాట్లను విక్రయించనున్నారు. ఇందులో మొత్తం 234 ప్లాట్లు ఏర్పాటు చేస్తుండగా, 240 చదరపు అడుగుల(5 సెంట్లు) పాట్లు-69, 200 చదరపు అడుగుల(4సెంట్లు)ప్లాట్లు-95, 150 చదరపు అడుగుల(3సెంట్లు) ప్లాట్లు-53, ఇతర సైజుల్లో ఉన్న ప్లాట్లు-17 ఉన్నాయి. మధ్యతరగతి ఆదాయ వర్గాల సౌకర్యం కోసం ఏపీ ప్రభుత్వంచే అనుమతి పొంది, ఏపీ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(ఏపీ-రెరా) నందు రిజిస్టర్ కూడా చేశారు. 60 అడుగుల తారు(బీటీ)రోడ్డు, 40 అడుగుల సిమెంటు కాంక్రీట్ రోడ్లు, కలర్‌టైల్స్‌తో ఫుట్‌పాత్‌లు, ఈఎల్ఎస్ఆర్ ద్వారా డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌తో నీటి సరఫరా, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌తో భూగర్భ మురుగు కాలువ పైపులైన్లు, నిరంతర విద్యుత్ సరఫరా, వర్షపునీటి కాలువలు, వీధి దీపాలు, పార్కులు, బయలు ప్రదేశాలలో పచ్చదనాన్ని అభివృద్ధి చేయుట వంటి సకల సౌకర్యాలు కల్పించనున్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం ప్లాట్లను 20 శాతం రిబేటుతో, ప్రభుత్వ పెన్షనర్లకు 5 శాతం ప్లాట్లను రిబేటు లేకుండా పొందే అవకాశం ఉంది.

ఇవీ నిబంధనలు

ఒక కుటుంబానికి ఒక ప్లాటు మాత్రమే ఇస్తారు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తుదారు వయసు 18 సంవత్సరాలు నిండి ఉండాలి. ఏపీలో తప్పనిసరిగా నివాసితులై ఉండాలి. దరఖాస్తు దారుని ఆధార్ కార్డు, చిరునామా చెల్లుబాటు అయి ఉండాలి. ఆసక్తిగల వారు ఆన్‌లైన్ ద్వారా ఎంఐజీపీడీటీసీ పీ.ఏపీ.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 23వ తేది నుంచి నమోదుకు అవకాశం కల్పించారు. ప్లాటు కేటగిరి మొత్తం విలువలో 10 శాతం ముందే చెల్లించాలి. దరఖాస్తుదారులకు కంప్యూటర్ ద్వారా పారదర్శకంగా లాటరీ పద్ధతిలో ప్లాట్లు కేటాయిస్తారు. ప్లాటు కేటాయించిన దరఖాస్తు దారులు అగ్రిమెంట్ చేసుకొని తదుపరి మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో ఆన్‌లైన్‌లో జమ చేయాలి. అగ్రిమెంట్ చేసుకున్న తేదీ నుంచి ఒక నెలలోపు ప్లాటు మొత్తం అమ్మకపు విలువలో 30 శాతం, ఆరునెలల్లోపు 30 శాతం, పన్నెండు నెలల్లోపు 30 శాతం, వడ్డీ చెల్లించాలి. నెలలోపే ప్లాట్లు మొత్తం విలువ చెల్లించిన వారికి 5 శాతం రిబేటు ఇస్తారు. ఆలస్యంగా చెల్లించిన వారికి ప్రతి స్టేజీలో 0.5 శాతం వడ్డీతో వసూలు చేస్తారు.

సరసమైన ధరలకే ప్లాట్లు



రైల్వేకోడూరు జగనన్న స్మార్ట్ విలేజ్‌కు సంబంధించి పదిహేను రోజుల్లోనే టెండర్లు పూర్తి చేస్తాం. బద్వేల్ ఎంఐజీ లే ఔట్ టెండర్లు పూర్తయ్యాయి. ప ను లు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ప్ర భు త్వం నుంచి అన్ని అనుమతులతో తక్కువ ధరలకే ఇస్తున్న ప్లాట్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.ఎంఐజీ లే ఔట్ల ద్వారా ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– ఎస్. గురుమోహన్, చైర్మన్, అన్నమయ్య పట్టణాభివృద్ధి సంస్థ

మధ్యతరగతి వర్గాలు సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లను మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులు, పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలి. అన్నిచోట్లా హైవేలకు పక్కనే ఇవి ఉన్నాయి. మార్కెట్ ధర ఎక్కువ ఉన్నప్పటికీ ప్రభుత్వం కనీస ధర నిర్ణయించింది. త్వరలోనే రాయచోటి దిగువ అబ్బవరంలో రెండోదశ కింద 20 ఎకరాల్లో మరో లే ఔట్ వేయబోతున్నాం.

–వై ఓ నందన్, వైస్ చైర్మన్, అనుడ

క్లుప్తంగా

ప్రయాణికుడి వద్ద రూ.50 వేల చోరీ

మార్కాపురం : కడప జిల్లా గోపవరం మండలం ఉప్పల్లివారి గ్రామానికి చెందిన బైరిశెట్టి మధు శుక్రవారం శ్రీశైలం నుంచి మార్కాపురం వచ్చాడు. ఇక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్నాడు. ఆ సమయంలో తన జేబులో ఉన్న రూ.50 వేల నగదు మాయం కావడంతో ఆందోళనకు గురయ్యాడు. జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించడంపై బస్టాండ్‌లోని ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. అయితే, ఈ సంఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య



గండికోట వెనుక జలాల నుంచి మృతదేహాన్ని తీసుకొస్తున్న దృశ్యం

కొండాపురం : స్థానిక తపాలా శాఖ పోస్ట్‌మాస్టర్ కొండు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి(31) గండికోట రిజర్వాయర్ వెనుక జలాల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపురంలోని తపాలా శాఖలో కొండు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పోస్ట్‌మాస్టర్‌గా విధులు నిర్వర్తించేవారు. ఈ నెల 24న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో అదే రోజు కుటుంబ సభ్యులు కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతను ద్విచక్రవాహనం, ఫోన్, చెప్పులు రైల్వే వంతెన సమీపంలోని గండికోట వెనుక జలాల వద్ద ఉన్నట్లు స్థానికులు తెలిపారు. దీంతో రెండు రోజులుగా పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం కోసం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఖేలో ఇండియా వర్సిటీ క్రీడలకు పయనం

కడప ఎడ్యుకేషన్ : ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, జీబీ నగర్‌లో ఈ నెల 29 నుంచి జరగబోయే ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడలకు వైవీయూ క్రీడాకారులు పయనమయ్యారు. ఇందులో వెయిట్‌లిఫ్టింగ్ పురుషుల విభాగం నుంచి ఆల్ ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన రవిశంకర్, టాప్–8లో ఉన్న సూర్య, తబదోసుమ్‌లు, వెయిట్ లిఫ్టింగ్ మహిళల విభాగంలో స్వప్నప్రియ, బోర్నలి బోరాలు, హైజంప్ క్రీడాకారులు షేక్ మొహిద్దీన్‌లు ఉన్నారు. క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలతో తిరిగి రావాలని విశ్వ విద్యాలయ వైస్ చాన్స్‌లర్, క్రీడాబోర్డు చైర్మన్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కృష్ణారెడ్డిలు ఆకాంక్షించారు. ప్రత్యేక శిక్షణ అనంతరం క్రీడాకారులు పోటీలకు బయలుదేరుతున్నట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ కొవ్వూరు రామసుబ్బారెడ్డి తెలిపారు.

కోలుకుంటున్న బస్సు ప్రమాద బాధితులు

- గ్రామస్తుల తక్షణ స్పందనతో తప్పిన ప్రాణాపాయం
- 108, వైద్య సిబ్బంది సేవలు ప్రశంసనీయం



బోల్తా పడ్డ బస్సు వద్ద గుమికూడిన జనం (ఫైల్)



చికిత్స పొందుతున్న ప్రయాణికులు కృష్ణమూర్తి, సద్దాం, క్లీనర్ రమణప్ప

మదనపల్లె : మండలంలోని వేంపల్లె పంచాయతీ కూకటిమానుగడ్డ వద్ద బెంగళూరు–తిరుపతి ప్రైవేట్ బస్సు బోల్తా ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు కోలుకుంటున్నారు. బెంగళూరు–మదనపల్లె హైవే రోడ్డుపై బస్సు అతివేగంగా వస్తూ కారును తప్పించపోయి వెనుకభాగాన గుద్ది అదుపుతప్పి రోడ్డుపక్కన కాలువలో గురువారం బోల్తా పడిన విషయం విదితమే. బస్సులో సుమారు 70 మంది వరకు ప్రయాణికులు ఉండగా, అందులో 63 మంది గాయపడగా, వారిలో 11 మంది తీవ్రంగా గాయపడిన సంగతీ తెలిసిందే. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా ఉన్న 16 మందిలో శుక్రవారం 13 మంది డిశ్చార్జి అయ్యారు. మిగిలిన ముగ్గురు చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్యం కోసం రెఫరల్‌పై వెళ్లిన ఆరుగురు బెంగళూరులోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని, ప్రాణాపాయం తప్పినట్లేనని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా బస్సు ప్రమాదం విషయం తెలిసిన వెంటనే కూకటిమానుగడ్డ, చీకలబైలు, బార్లపల్లె, జవుకుపల్లె గ్రామస్తులు తక్షణమే స్పందించడం, బస్సులో నుంచి క్షతగాత్రులను వెలుపలకు తీసుకురావడం, 108 అంబులెన్స్‌లకు సమాచారం అందించడంతోపాటుగా ప్యాసింజర్ ఆటోలలో హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనలో మదనపల్లె 108 అంబులెన్స్‌తోపాటుగా సమీప మండలాలకు చెందిన అంబులెన్స్‌లు కూకటిమానుగడ్డకు చేరుకుని తమవంతు సేవలు అందించాయి. బాధితులు జిల్లా ఆస్పత్రికి చేరుకున్న వెంటనే ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పాల్ రవికుమార్, ఆర్‌ఎంఓ దివాకర్ ఆస్పత్రిలోని వైద్యులందరినీ అప్రమత్తం చేసి సుమారు 20 మంది వైద్యులతో పాటుగా నర్సింగ్, మెడికల్ సిబ్బందితో సమర్థవంతంగా వైద్యసేవలు అందించారు. బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిలో కృష్ణమూర్తికి ఒక కన్ను దెబ్బతినడంతోపాటుగా కాలు పూర్తిగా విరిగిపోయింది. మేదరవీధికి చెందిన శారదమ్మ బస్సు కింద పడిపోవడంతో నడుము విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. శుక్రవారం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బస్సు క్లీనర్ రమణప్ప మాట్లాడుతూ.. విధుల్లో భాగంగా తాను వెనుక డోర్‌లో నిల్చుని ఉండగా, ఉన్నట్లుండి బస్సు సడెన్‌గా బ్రేక్ వేయడం, బోల్తా పడటం జరిగిందన్నారు. ప్రమాదంలో తాను అపస్మారకస్థితికి చేరుకున్నానని, మెలకువ వచ్చేసరికి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నానన్నారు. మూడేళ్లుగా బస్సు క్లీనర్‌గా పని చేస్తున్నట్లు చెప్పారు. కలికిరి మండలం గుండ్లూరు గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ సద్దాం మాట్లాడుతూ బెంగళూరు లోని తన చెల్లెలు ఇంటికి వెళ్లిన తాను గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో దేవనహళ్లిలో బస్సు ఎక్కానని, అప్పటికే బస్సులో 70 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారన్నారు. బస్సు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నప్పుడు ఎదురుగా యూటర్న్ తీసుకుంటున్న కారును ఢీకొట్టి కాలువలో బోల్తా పడిందన్నారు. ఘటనలో తనకు చేయి విరిగిందని చెప్పుకొచ్చారు.

వలసజీవులే అధికం

భారతీమోటార్ ప్రైవేట్‌బస్సు బెంగళూరు నుంచి తిరుపతికి రోజూ రెగ్యులర్‌గా నడిచే సర్వీసు బస్సు. ఇందులో భాకరాపేట, రొంపిచెర్ల, పీలేరు, చింతపర్తి, వాల్మీకిపురానికి చెందిన పలువురు జీవనోపాధి నిమిత్తం బెంగళూరు నగరంలో స్థిరపడిన వారు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో ఉదయం 8.40 గంటలకు బెంగళూరు యలహంకలో చివరిగా 70 మంది ప్రయాణికులతో బయలుదేరిన బస్సు నాన్‌స్టాప్ సర్వీస్‌గా విజయపుర, హెచ్‌క్రాస్, చింతామణి మీదుగా మదనపల్లెకు దాదాపు 135 కిలోమీటర్లు కేవలం 2.20 గంటల వ్యవధిలో చేరుకునేందుకు 100–110 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంటుంది. అతివేగంగా, నిర్ణీత సమయానికి వెళుతుందనే భావనతో చాలా మంది ప్రయాణికులు ఈ బస్సు కోసం ఎదురుచూసి మరీ ఇందులో ప్రయాణిస్తుంటారు. ఎప్పటిలాగే వేగంగా వెళుతున్న బస్సు గురువారం ఉదయం అడ్డుగా వచ్చిన కారును తప్పించే క్రమంలో బోల్తా పడటం జరిగింది. బస్సును డ్రైవర్ రాఘవ అతివేగంగా నడుపుతుండటంతో తగ్గించాలని హెచ్చరించినా సమయం సరిపోదని చెపుతూ వేగంగా నడిపాడని ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులు చెప్పారు.

పూర్తి స్థాయి దర్యాప్తు

బస్సు ప్రమాద ఘటనపై అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తామని, బాధ్యులపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తామని డీఎస్పీ కేశప్ప, ఆర్డీఓ మురళీ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలను అతివేగంగా నడపడం, ఓవర్ లోడింగ్ కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. కర్ణాటక నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించే ప్రైవేట్ బస్సుల వేగంపై దృష్టి పెడతామని, ప్రమాదఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహించి నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు.

యువకుడిపై దాడి



గాయపడ్డ గణేష్

పులివెందుల : పట్టణంలో ఓ యువకుడిపై ఆరుగురు దాడి చేయడంతో గాయాల పాలయ్యాడు. రాజారెడ్డి కాలనీలో గణేష్ (22) అనే యువకుడు జనార్ధన్ అనే మరో వ్యక్తికి రూ.2 లక్షలు బాకీ ఉన్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం జనార్ధన్, గౌతమ్‌తోపాటు మరి కొంత మంది స్నేహితులతో కలిసి శ్రీసరస్వతి విద్యా మందిరం వద్ద ఉన్న గణేష్ వద్దకు వెళ్లి డబ్బుల బాకీ విషయమై అడిగాడు. ఈ నేపథ్యంలో గణేష్, జనార్ధన్ మధ్య వాగ్వాదం జరిగింది. జనార్ధన్‌తోపాటు మరో ఐదుగురు యువకులు గణేష్‌ను కత్తితో పొడిచారు. గాయపడ్డ గణేష్‌ను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పోలీసులు తరలించారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



నాగశేఖర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఖాజీపేట : మండల పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం మోటారు సైకిల్‌ను కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆంజనేయపురం గ్రామానికి చెందిన బేరి నాగశేఖర్(41) చెన్నముక్కపల్లెలో ఉన్న తన పొలంలోని గడ్డి కోసం వెళ్లాడు. ద్విచక్ర వాహనంలో గడ్డి తీసుకుని జాతీయ రహదారిపైకి రాగానే ఆంజనేయపురం గ్రామం వద్ద కడప నుంచి కర్నూలు వెళ్తున్న కారు ఢీకొంది. నాగశేఖర్ కింద పడి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బామ్మర్ది పుల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కారులోని వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ కుళ్లాయప్ప తెలిపారు.

బొలేరో, బైక్ ఢీకొని మహిళ మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

గుర్రంకొండ : బొలేరో వాహనం, బైక్ ఢీకొని మహిళ మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన గుర్రంకొండలో జరిగింది. మండలంలోని సరిమడుగు పంచాయతీ పరిధి నాగరాజపురానికి చెందిన ఎస్.లక్ష్మీనారాయణ(55), సుబ్బిరెడ్డిగారిపల్లెకు చెందిన కె.కనకమ్మ(45) శుక్రవారం ఉదయం గుర్రంకొండలో జరిగే వారపు సంతకు వచ్చారు. సాయంత్రం తిరిగి తమ స్వగ్రామాలకు ఒకే ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లె గ్రామం నుంచి టమాట లోడుతో బయలు దేరిన బొలేరో వాహనం గుర్రంకొండ పట్టణానికి సమీపంలోని శ్రీకృష్ణదేవరాయ విగ్రహం వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో లక్ష్మీనారాయణ, కనకమ్మకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని హుటాహుటిన 108 వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో కనకమ్మ మృతి చెందింది. లక్ష్మీనారాయణకు మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలు అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ నాగరాజు

ముద్దనూరు : ముద్దనూరులో ఈ నెల 21న నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును డీఎస్పీ నాగరాజు శుక్రవారం విచారణ చేశారు. ఈ వివరాలను స్థానిక సీఐ నరేష్‌బాబు వెల్లడించారు. కొత్తకొట్టాల వీధిలో ఆంజనేయులు అనే వ్యక్తి స్పందన ఫైనాన్స్‌లో రూ.1 లక్షా 50 వేల రుణం తీసుకున్నారు. ప్రతి నెల రూ.6450 చొప్పున 26 కంతులు చెల్లించారు. మార్చి 7న కంతు చెల్లించాల్సి ఉంది. ఫైనాన్స్ ప్రతినిధులు వచ్చిన సమయంలో ఆంజనేయులు ఇంటిలో లేడని ఆయన భార్య నాగేశ్వరి చెప్పారు. తిరిగి ఏప్రిల్ 11న వచ్చి కంతు చెల్లించాలని అడగగా, తన భర్త ఇంటిలో లేడని ఆమె పేర్కొన్నారు. అయితే ఈ సందర్భంగా మస్తాన్‌రెడ్డి తనను కులం పేరుతో దూషించారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 21న మస్తాన్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా డీఎస్పీ నాగరాజు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ నరేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కువైట్‌లో కొత్త సింగనమల వాసి మృతి

పెనగలూరు : మండలంలోని కొత్త సింగనమల దళితవాడకు చెందిన సింగనమల పెంచలయ్య (28) మంగళవారం కువైట్‌లో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బతుకు దెరువుకోసం కువైట్ దేశానికి వెళ్లి పని నిమిత్తం రోడ్డుపై వెళ్తుండగా వాహనం ఢీ కొనడంతో మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. మృతదేహం శుక్రవారం రాత్రి స్వగ్రామమైన కొత్త సింగనమల దళితవాడకు చేరుకుంది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. నిత్యం కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా మాట్లాడుతూ యోగక్షేమాలు తెలుసుకుంటున్న పెంచలయ్య.. మృతి చెందాడన్న వార్త తెలియగానే వారు శోకసముద్రంలో మునిగిపోయారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


వెలుగు చూసిన శిల్పాలు, శాసనాలు



గండిక్షేత్రంలో లభించిన శిల్పాలు



బండపై గల శాసనం



శాసనం వద్ద కొండశిలపై హనుమంతుని శిల్పం

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రమైన గండిలో రెండు శాసనాలు, రెండు శిల్పాలను గుర్తించారు. నూతన ఆలయ నిర్మాణంలో భాగంగా పాత ఆలయాన్ని తొలగించారు. స్థల వైశాల్యం కోసం సమీపంలో కొద్దిమేర కొండ శిలలను కూడా తొలగించారు. శుక్రవారం ఆ శిథిలాలను తొలగిస్తుండగా స్థానిక వేద పండితులు రామ్మోహన్.. ఆంజనేయస్వామి రూపం గల శిల్పం, సీతారాములు, గణపతి శిల్పాలను గుర్తించారు. దాంతోపాటు చిన్న శాసనాన్ని కూడా గుర్తించారు. కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డికి ఈ ఫొటోలను పంపారు. ఆయన కేంద్ర పురావస్తుశాఖ అధికారి మునిరత్నంరెడ్డికి పంపగా ఆయన వాటిని ప్రాథమికంగా పరిశీలించి వివరాలను తెలిపారు. తెలుగు భాషలో ఉన్న ఈ శాసనం 16వ శతాబ్దం నాటిదని, దుందుభి నామ సంవత్సరం మార్గశిర శుద్ధ ద్వాదశి నాడు వేయించినదని మునిరత్నంరెడ్డి తెలిపారు. స్థానికులైన కొండునాయల కుమారుడు బాలకొండ తన తల్లిదండ్రుల పుణ్యం కోసం గండి వద్ద హనుమంతుడి శిల్పం ప్రతిష్ఠించినట్లు ఇందులో ఉందన్నారు. హనుమంతుని కుడ్య శిల్పంగల బండ పక్కనే ఈ చిన్న శాసనాన్ని గుర్తించారని, మరో పెద్ద శాసనం కూడా ఆ పక్కనే ఉందని, దాన్ని చదవడానికి వీలు కావడం లేదని డాక్టర్ చింతకుంట శివారెడ్డి తెలిపారు. శనివారం ఆ శాసనం నకలును తీసి పరిశోధకులకు పంపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీని పక్కనే ధనస్సును ధరించిన శ్రీరాముడుతోపాటు సీతమ్మ, ఆ పక్కనే గణపతి కుడ్య శిల్పం ఉన్నాయని చెప్పారు. శనివారం వీటి గురించి మరింత సమాచారం అందే అవకాశం ఉందని ఆయన వివరించారు.

వరుస చోరీలు.. ప్రజల బెంబేలు

- పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు
- పట్టుకోవడానికి ప్రత్యేక బృందం ఏర్పాటు



చోరీ జరిగిన ఇంటి వద్ద విచారణ చేస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్



గ్రీన్‌ల్యాండ్‌లో తలుపు లాక్‌ను తొలగించిన దొంగలు

ప్రొద్దుటూరు క్రైం : ఘరానా దొంగల కన్ను ప్రొద్దుటూరుపై పడినట్లుంది. వరుస చోరీలు జరుగుతుండటంతో దొంగలు ఇక్కడే తిష్టవేశారా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. ఇంట్లో ఎవరూ లేరని పసిగట్టి, మరీ చోరీలకు పాల్పడుతున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు వరుసగా ఐదు చోట్ల ఇళ్లకు కన్నం వేశారు. కొన్ని రోజుల వ్యవధిలోనే ఇవన్నీ జరగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రొద్దుటూరు రూరల్‌తోపాటు పట్టణంలో చోరీలు జరుగుతున్నాయి. ఒకదాని తర్వాత మరొకటి జరుగుతుండటంతో ఇల్లు వదలి బయటికి వెళ్లాలన్నా ప్రజలు భయపడి పోతున్నారు.

ఇటీవల జరిగిన చోరీల వివరాలు ఇలా ఉన్నాయి.

- కొన్ని రోజుల క్రితం చౌడూరులోని ఒక ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఉన్న సుమారు 10 తులాల బంగారు బిస్కెట్‌ను దొంగలు దోచుకెళ్లారు.
- అలాగే ఈ సంఘటన జరిగిన నాలుగైదు రోజుల్లోనే పక్కనే ఉన్న శంకరాపురం గ్రామంలో మరో చోరీ జరిగింది.
- దొరసానిపల్లెలోని ఒక ఇంట్లో సుమారు 6 తులాల బంగారు నగలను దోచుకెళ్లారు.
- విజయనగరం వీధిలో సుమారు 27 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. కుటుంబ సభ్యులు బంధువుల వివాహ వేడుకల కోసం చెన్నైకి వెళ్లగా ఈ చోరీ జరిగింది.
- రెండు రోజుల క్రితం మైదుకూరు రోడ్డులోని టీచర్స్ కాలనీ సమీపంలో ఉన్న గ్రీన్‌ల్యాండ్ విల్లాలో భారీ చోరీ జరిగింది. ఆడిటర్ వెంకటేశ్వర్లు ఇంట్లో సుమారు 856 గ్రాముల బంగారం చోరీకి గురైంది. వెంకటేశ్వర్లు, భార్య లావణ్య బంధువుల శుభకార్యం నిమిత్తం రైల్వేకోడూరుకు వెళ్లారు. వారు వెళ్లిన విషయాన్ని పసిగట్టిన దొంగలు అదే రోజు రాత్రి వారి ఇంటికి కన్నం వేశారు. ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇలా వరుసగా ఇళ్లకు కన్నం వేస్తూ పోలీసులకు దొంగలు సవాల్ విసురుతున్నారు.

ఎస్పీ అన్బురాజన్ సీరియస్ : ప్రొద్దుటూరులో జరుగుతున్న వరుస దొంగతనాలపై జిల్లా ఎస్పీ అన్బురాజన్ సీరియస్ అయినట్లు తెలుస్తోంది. సంబంధిత పోలీసు అధికారులపై కూడా ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కాగా దొంగలను పట్టుకోవడంతోపాటు తదుపరి చోరీలు జరగకుండా ఉండేందుకు ఎస్పీ ప్రత్యేక పోలీసు టీంను ఏర్పాటు చేశారు. కడప సీసీఎస్‌కు చెందిన పోలీసులతోపాటు ప్రొద్దుటూరుకు చెందిన 10 మందితో స్పెషల్ టీం శుక్రవారం ఏర్పాటైంది. దొంగల కోసం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

ఇకే తరహాలో..

జరుగుతున్న చోరీలన్నీ ఒకే తరహాలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. దొరసానిపల్లె, విజయనగరం వీధి, గ్రీన్‌ల్యాండ్‌లో చోరీలు జరిగిన విధానం ఒకేలా ఉన్నాయి. మూడు చోట్ల ప్రధాన ద్వారం లాక్‌కు ఉన్న చెక్కను తొలగించి దొంగలు ఇంట్లోకి ప్రవేశించారు. చెక్కను తొలగించేందుకు దొంగలు చిన్న పాటి స్క్రూడ్రైవర్ లాంటి ఇనుప పరికరాన్ని ఉపయోగించినట్లు పోలీసులు భావిస్తున్నారు. దొంగతనాలు జరుగుతున్న విధానాన్ని బట్టి ఒకే దొంగల ముఠా చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దొంగలకు స్థానికంగా ఎవరైనా సహకరిస్తున్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనుమానితులు ఎవరైనా వీధుల్లో కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని స్థానిక పోలీసు అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇళ్లకు తాళం వేసి ఎక్కడికైనా వెళ్లాల్సి వస్తే.. ఇంట్లో ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు.

లంకమలలో కూంబింగ్

సిద్దవటం : లంకమల అభయారణ్యంలో అటవీ శాఖ అధికారులు వారం రోజులుగా కూంబింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా సిద్దవటంలోని అటవీ శాఖ కార్యాలయంలో డిప్యూటీ రేంజర్ కె.ఓబులేస్ శుక్రవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అటవీశాఖ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి మెలకువలు నేర్పుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు బీటు అధికారి రాజశేఖర్‌రెడ్డి, ప్రొటెక్షన్ వాచర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



హత్య కేసులో అన్నదమ్ములకు జీవితఖైదు

సంబేపల్లె/రాయచోటిటౌన్ : హత్య కేసులో అన్నదమ్ములకు రాయచోటి కోర్టు శుక్రవారం జీవిత ఖైదు విధించింది. ఈ వివరాలను రాయచోటి రూరల్ సీఐ లింగప్ప, ఎస్‌ఐ ఎమ్‌డీ షరీఫ్ వెల్లడించారు. సంబేపల్లె మండల పరిధిలోని దుద్యాల గ్రామ పంచాయతీ వడ్డెపల్లెలో 2021 డిసెంబర్ 31న పల్లపు రమణ, కోటేశ్వర అన్నదమ్ములు మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని తల్లి కృష్ణమ్మను కొడుతుండగా.. పొరిగింటికి చెందిన పసుపులేటి వెంకటరమణ(57) వారించేందుకు ప్రయత్నించాడు. ఇది నచ్చని అన్నదమ్ములు తమకు అడ్డు చెబుతావా అంటూ కోపోద్రిక్తులై మారణాయుధంతో వెంకటరమణని చెవి కింద భాగాన పొడవగా తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితులను రాయచోటి 5వ అదనపు కోర్టులో హాజరుపరిచారు. బాధితుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. నిందితులపై నేరం రుజువైంది. ఈ నేపథ్యంలో జడ్జి ఎస్. కృష్ణన్ కుట్టి.. ఇద్దరికీ జీవిత ఖైదుతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసును త్వరగా విచారణ జరిపి ముద్దాయిలకు శిక్ష పడేలా చర్యలు తీసుకున్న రాయచోటి రూరల్ సీఐ లింగప్ప, ఎస్‌ఐ ఎమ్‌డీ షరీఫ్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.